సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 31 । మార్చి । 2024



హలీం.. సలాం!

రంజాన్ మాసంలో మాత్రమే లభించే హలీం ఇప్పుడు ఉమ్మడి పశ్చిమ గోదావరి లోని పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు.


IIలో ▸



నాటు తుపాకులు స్వాధీనం

కైకలూరు మండలం రామవరంలో శనివారం లైసెన్స్ లేని రెండు నాటు తుపాకీ లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

IIలో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ ఆదివారం (సాయంత్రం)	సహరి సోమవారం (ఉదయం)
భీమవరం	6.23	4.40
ఏలూరు	6.26	4.37

ఎన్నికల వేళ ప్రాధాన్యం

- రబీ ధాన్యం సేకరణకు ఏర్పాట్లు
- జిల్లాలో 2.4 లక్షల ఎకరాల్లో సాగు
- 9.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం
- 324 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- 1.8 కోట్ల గోనెసంచులు సిద్ధం



యంత్రంతో వరికోతలు కోస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, భీమవరం: జిల్లాలో రబీ కోతలు మొదలయ్యాయి. దీంతో ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేపట్టింది. రబీలో 9.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా కాగా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు లక్ష్యంగా నిర్ణయించారు. ఒకపక్క ఎన్నికల ప్రక్రియ హడావుడి నేపథ్యంలో కొనుగోలు విషయంలో రైతులకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకుంటున్నారు.

జిల్లాలోని 2.4 లక్షల ఎకరాల్లో రైతులు రబీ సాగుచేశారు. ఖరీఫ్ చివరలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ కారణంగా దాదాపు రెండు వారాలపాటు సాగు ఆలస్యమైంది. ముందుగా నాట్లు వేసిన తాడేపల్లిగూడెం, పెంటపాడు, గణపవరం, తణుకు మండలాల్లో పంట తుది దశకు చేరగా వరికోతలు మొదలయ్యాయి. మరో వారం రోజుల్లో ఆయా ప్రాంతాల్లో కోతలు జోరందుకుంటాయి. ఆలస్యంగా నాట్లు పడిన నరసాపురం, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండలాల్లో ప్రస్తుతం పంట కంకి దశలో ఉంది. త్వరలో వరికోతలు మొదలుకానున్నాయి.

ఆశాజనకంగా దిగుబడులు

సాగు ఆలస్యమైనా ప్రభుత్వ ఆదేశాలు మేరకు వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో పని చేయడంతో సాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. తెగుళ్ల తక్కువగా ఉండడంతో దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. ఎకరాకు 50 నుంచి 55 బస్తాలు దిగుబడులు వస్తాయని అంచనా.

రైతుల వద్దకు నేరుగా

ఈ క్రాప్‌లో నమోదైన వివరాల మేరకు ఆర్‌బీకే సిబ్బంది నేరుగా పొలాల్లో రైతుల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేస్తారు. ధాన్యాన్ని పరిశీలించి నాణ్యత లోపిస్తే ఎలా మెరుగుపర్చుకోవాలో వివరిస్తారు. అవసరమైన గోనె సంచులను వారే సమకూరుస్తారు. కొనుగోలు అనంతరం రవాణ కాంట్రాక్టరుకు తెలియజేసి సంబంధిత రైస్‌మిల్లుకు తరలిస్తారు. రైతులు ఏ విధమైన రవాణ చార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు.

సత్వర చెల్లింపులకు చర్యలు

ఖరీఫ్‌లో మాదిరి ధాన్యం విక్రయించిన వారం లోపే సత్వర చెల్లింపులు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సాధారణంగా ధాన్యం సేకరించిన మూడు వారాల లోపు రైతుల ఖాతాలకు సొమ్ములు జమచేయాలి. రైతు ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖరీఫ్‌లో వారం రోజులలోపే చెల్లింపులు చేసింది. గత సీజన్‌లో దాదాపు 68,163 మంది రైతుల నుంచి రూ.924 కోట్ల విలువైన 4.25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించారు. అధికశాతం రైతులకు వారం లోపే ధాన్యం సొమ్ములు జమయ్యాయి. సాంకేతిక సమస్యలతో మిగిలిన వారికి ఆలస్యమయ్యాయి. దాళ్వాలో అదే తరహాలో సత్వర చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జేసీ ప్రవీణ్ ఆదిత్య ఆదేశాలు మేరకు జిల్లాలో ధాన్యం సేకరణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని సివిల్ సప్లయిస్ డీఎం టి.శివరామప్రసాద్ తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా 9.45 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా. స్థానిక అవసరాలు పోను జిల్లాలోని 324 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా 7.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ చేయాలని జిల్లా ప్రొక్యూర్‌మెంట్ కమిటీ నిర్ణయించింది. ఏప్రిల్ మొదటి వారం నుంచి ధాన్యం సేకరణ కోసం కలెక్టర్ సుమిత్‌కుమార్ పర్యవేక్షణలో జేసీ ప్రవీణ్ ఆదిత్య ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అసెం

7.5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ

బ్లీ, పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో తలమునకలై ఉన్నప్పటికి రైతులకు ఎక్కడా ఇబ్బంది కలుగకుండా సేకరణకు చర్యలు తీసుకుంటున్నారు. 211 పెద్ద, చిన్న రైసు మిల్లులు గుర్తించి, వాటికి కస్టోడియన్ అధికారుల్ని నియమించారు. 1.8 కోట్ల గోనెసంచులు సిద్ధం చేశారు. మండల స్థాయి సేకరణ కమిటీలు నియమించారు. హమాలీలతో పాటు 2,600 వాహనాలకు జీపీఎస్ పరికరాలు అమర్చి సిద్ధం చేశారు. గత అనుభవాల నేపథ్యంలో ఎక్కడా లోపాలు తలెత్తకుండా కొనుగోళ్ల పర్యవేక్షించేందుకు మొబైల్ టీంలు ఏర్పాటు చేస్తున్నారు. గ్రేడ్‌ఏ రకం క్వింటాల్‌కు రూ.2,203 కాగా 75 కేజీల బస్తా రూ.1652, సాధారణ రకం క్వింటాల్‌కు రూ.2,183, 75 కేజీల బస్తాకు రూ.1,637 ధరను అందించనున్నారు.

న్యూస్‌రీల్

జిల్లా కోర్టులో అభివృద్ధి పనులు ప్రారంభం



కోర్టు ప్రాంగణంలో లిఫ్ట్‌ను ప్రారంభిస్తున్న హైకోర్టు జడ్జి జస్టిస్ కృష్ణమోహన్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలోని న్యాయమూర్తుల వర్క్‌షాపులో పాల్గొనేందుకు ఏలూరు విచ్చేసిన హైకోర్టు జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ జిల్లా కోర్టు ఆవరణలో పలు అభివృద్ధి పనులను శనివారం ప్రారంభించారు. కోర్టు ప్రాంగణంలో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్, మొదటి అదనపు జిల్లా జడ్జి జి.రామగోపాల్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్ కుమార్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది జస్టిస్ బి.కృష్ణమోహన్‌కు స్వాగతం పలికారు. జిల్లా కోర్టు ప్రాంగణంలో కక్షిదారుల సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన లిఫ్ట్‌ను ఆయన ప్రారంభిచారు. అనంతరం సౌర విద్యుత్ సౌకర్యాన్ని, కోర్టు హాలులో ఏర్పాటు చేసిన ఏసీలను ప్రారంభించారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

భీమవరం (ప్రకాశంచౌక్): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని ఆర్డీవో కె..శ్రీనివాసుల రాజు హెచ్చరించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టరేట్ ఆవరణలోని డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో ఆర్డీవో బి.శ్రీనివాసులు రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ చట్ట ప్రకారం లింగ నిర్ధారణ చేసే సామర్థ్యం ఉన్న ఏ పరికరానైనా సంబంధిత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ వద్ద తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు. సంబంధిత గర్భిణీకి గాని, ఆమె బంధువులకు గానీ పుట్టబోయే బిడ్డ లింగ వివరాలను వెల్లడించరాదన్నారు. నిబంధనలు మొదటిసారి ఉల్లంఘిస్తే వైద్యులు, నిపుణులు, ఇతరులకు మూడు సంవత్సరాల జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తారన్నారు. అదేవిధమైన ఉల్లంఘనకు పాల్పడే వారికి యాభై వేల రూపాయల జరిమానాతోబాటు ఐదేళ్ల జైలు శిక్ష కూడా విధిస్తారన్నారు. అదే తప్పు మరలా చేసినట్లయితే పూర్తిగా సర్టిఫికెట్ రద్దు చేస్తారని పేర్కొన్నారు. అబార్షన్స్ ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ హాస్పిటల్ గుర్తించి వాటిపై సమగ్ర విశ్లేషణ రిపోర్టు అందించాలని కోరారు. జిల్లాలో రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్ సెంటర్లు నిర్వహించరాదన్నారు. లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న, ఎక్కువగా ఉన్న మండలాలను గుర్తించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వివాహ వయసుపై గ్రామస్థాయిలో సమావేశాలు నిర్వహించి బాల్యవివాహాలు అరికట్టాలని ఆర్డీఓ తెలిపారు.

మద్యం స్వాధీనం



పట్టుబడిన మద్యం, బీరు బాటిళ్లతో ఎస్సై లక్ష్మణ్

ఉండి : ఎన్నికల నియమావళిలో భాగంగా మండల శివారు ఆరేడు చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.లక్ష్మణ్ శనివారం చెప్పారు. ద్వారకాతిరుమల మండలం సీహెచ్ పోతిపల్లి గ్రామానికి చెందిన కటారి రాజ్‌కుమార్ అనే వ్యక్తి కారులో 12 బీరు బాటిళ్లతో పాటు ఒక మద్యం ఫుల్ బాటిల్‌ను కూడా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 294 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో దూరవిద్యా విధానంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ ప్రయోగ పరీక్షలు శనివారం ప్రశాంతంగా జరిగాయి. ఈ ప్రయోగ పరీక్షల్లో బాగంగా భౌతిక శాస్త్రం పరీక్షకు 160 మందికి 126 మంది హాజరు కాగా 34 మంది గైర్హాజరయ్యారు. రసాయన శాస్త్రం పరీక్షకు 140 మందికి 109 మంది హాజరుకాగా 31 మంది గైర్హాజరయ్యారు. జీవశాస్త్రం పరీక్షకు 65 మందికి 59 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా స్థాయి పరిశీలకులు, డీఈసీ కమిటీ ప్రతినిధులు తనిఖీ చేశారని, ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం తెలిపారు.

ఉప్పుటేరు చెక్‌పోస్టు తనిఖీ



ఉప్పుటేరు వంతెన వద్ద సీసీ కెమెరాల ఏర్పాటును తెలుసుకుంటున్న జేసీ ప్రవీణ్ ఆదిత్య

ఆకివీడు: పశ్చిమగోదావరి జిల్లా సరిహద్దు ఉప్పుటేరు వద్ద ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య ఆకస్మిక తనిఖీ చేశారు. చెక్‌పోస్టు వద్ద ప్రతి రోజూ వాహనాల తనిఖీ సంఖ్య, రికార్డులను పరిశీలించారు. సీసీ కెమెరాలు ఎక్కడెక్కడ ఏర్పాటు చేశారని పరిశీలించారు. జాతీయ రహదారిపై కృష్ణా జిల్లా నుంచి వచ్చే వాహనాల్ని, పశ్చిమగోదావరి జిల్లా నుంచి బయటకు వెళ్లే వాహనాల్ని కూడా తనిఖీ చేయాలని ఎస్‌ఐ బీ.నాగబాబుకు సూచించారు. 24 గంటలూ చెక్‌పోస్టు పనిచేయాలని, రిజిస్టర్‌లో పకడ్బందీగా నమోదు జరగాలన్నారు. నగదు, మద్యం, మాదక ద్రవ్యాలను తరలించకుండా కట్టడిచేయాలన్నారు. ఇంతవరకూ ఎంత మద్యం, నగదు స్వాధీనం చేసుకున్నారని ఎస్సైని అడిగి తెలుసుకున్నారు. ఆయా చెక్‌పోస్టుల వద్ద వాహనాల తనిఖీని సీసీ ఫుటేజీల ద్వారా ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామన్నారు. ఉప్పుటేరుపై ఏలూరుపాడు వంతెన వద్ద కూడా చెక్‌పోస్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. జేసీ వెంట ఎంపీడీఓ రామకృష్ణ, ఏఓ శ్రీకర్, కాళ్ల డీటీ నాగార్జున్ పాల్గొన్నారు.

వలంటీర్లపై కక్ష గట్టిన చంద్రబాబు

- వారిని విధుల నుంచి దూరం చేయడం దుర్మార్గం
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



తణుకు టౌన్: సంక్షేమ పథకాలను లబ్ధిదారుల గడప వద్దకే అందిస్తూ అనేక సంక్షేమ పథకాలను సకాలంలో అందిస్తున్న వలంటీర్లపై చంద్రబాబు నాయుడు కక్ష గట్టి ఎన్నికల సంఘంతో విధులకు దూరం చేయడం దుర్మార్గమైన చర్య అని రాష్ట్ర పౌర సరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం రాత్రి తణుకు రూరల్ మండలం మండపాకలోని మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు నివాసంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థ ద్వారా అందరికీ మేలు చేసేలా సంక్షేమ పథకాలను అందిస్తుంటే నిమ్మగడ్డ రమేష్ కుమార్ ద్వారా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం అన్యాయమన్నారు. వలంటీర్లు అంటే చంద్రబాబుకు ఎందుకంత ద్వేషమని, వలంటీర్ల విధులను అడ్డుకోవాల్సినంత నష్టం చంద్రబాబుకు ఏం వచ్చిందని ప్రశ్నించారు. ప్రజలకు మేలు చేయడం కూడా చంద్రబాబుకు ద్వేషమేనని, జిత్తుల మారిన నక్కలా, రాష్ట్ర ప్రజల పాలిట మాయల ఫకీరులా చంద్రబాబు తయారయ్యాడన్నారు. వలంటీర్లు ఎక్కడ నుంచో రాలేదని, మన ఇళ్ల చుట్టూ ఉన్న చదువుకున్న విద్యార్థులేనని చంద్రబాబు గ్రహించలేక పోతున్నారని చెప్పారు. ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రతతో వృద్ధులు, వికలాంగులు పింఛన్ కోసం ఎక్కడకి వెళ్లి తీసుకోవాలని, వారికి పింఛన్ డబ్బులు ఎవరిస్తారని? ప్రశ్నించారు. రాష్ట్రంలో తన పార్టీ కార్యకర్తలను కూడా వదలకుండా ఇబ్బందులకు గురి చేసి చంద్రబాబు ఆనందిస్తున్నారని చెప్పారు. చంద్రబాబు నీచ బుద్ధిని గమనించి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్రంలో నిజం గెలవాలనే పేరుతో లక్షల రూపాయలను కుటుంబాలకు అందిస్తున్న భువనేశ్వరి ప్రలోభాలు కనిపించలేదా? అని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు.

ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ తనిఖీచేయాలి

భీమవరం (ప్రకాశంచౌక్): సెక్టార్ అధికారులు ప్రతి పోలింగు కేంద్రాన్ని తప్పక మూడు సార్లు తనిఖీ చేయాలని జాయింట్ కలెక్టరు, ఉండి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగు అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య అన్నారు. శనివారం స్థానిక కలెక్టరేటు వశిష్ట కాన్ఫరెన్స్ హాలులో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఉండి నియోజకవర్గానికి సంబంధించిన అసిస్టెంటు రిటర్నింగు అధికారులు, సెక్టార్ అధికారులు, ఉప తహసీల్దార్లు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లతో ప్రీ-పోలింగుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉండి నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులు ప్రతి పోలింగు కేంద్రాన్ని తప్పక మూడు సార్లు తనిఖీ చేసి, లొకేషన్, రూట్ మ్యాప్‌ను పరిశీలించాలన్నారు. ప్రతి పోలింగు బూత్ పరిధిలో స్థానిక ఓటర్లతో బిఎల్ఓలతో కలిసి రెండు సార్లు సమావేశాలు ఏర్పాటు చేయాలని సెక్టోరల్ అధికారులకు సూచించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక పోలింగు కేంద్రాలలో శాంతియుతంగా ఎక్కువ పోలింగు నమోదయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు.

● ఈస్టర్ వేడుకలకు ఏర్పాట్లు



మరణాన్ని జయించి ఏసుక్రీస్తు తిరిగి లేచిన రోజైన ఈస్టరును జరుపుకునేందుకు క్రైస్తవులు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల్లోని సమాధులను సుందరంగా అలంకరించారు. ఆదివారం తెల్లవారుజామున ఊరేగింపుగా శ్మశాన వాటికకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఉదయం 10 గంటల నుంచి చర్చిల్లో ప్రార్థనలు చేస్తారు. పై చిత్రంలో ఉండిలో శనివారం సాయంత్రం సమాధుల వద్ద అలంకరణ చేస్తున్న క్రైస్తవులు. - ఉండి

వైఎస్సార్‌సీపీలోకి జోరుగా చేరికలు



బియ్యపుతిప్పలో ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిక



శృంగవృక్షంలో కార్యకర్తలతో పీవీఎల్ నరసింహరాజు, గూడూరి ఉమాబాల

నరసాపురం రూరల్ : వైఎస్సార్ సీపీలో చేరేందుకు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు క్యూకడుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పెద్ద ఎత్తున పార్టీలో చేరి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై తమకున్న అభిమానాన్ని చాటుతున్నారు. తాజాగా శనివారం నరసాపురం మండలం బియ్యపుతిప్ప గ్రామంలో జనసేన, తెలుగుదేశం పార్టీల నుంచి పెద్ద ఎత్తున ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పార్టీ కండువాలు కప్పి ముదునూరి సాదరంగా వైఎస్సార్ సీపలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదరికమే కొలమానంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడంతో పార్టీలో చేరుతున్నామన్నారు. పార్టీలో చేరిన వారిలో మాజీ సర్పంచ్ తిరుమాని నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ మల్లాడి ధనరాజు, ఒడుగు వెంకటకృష్ణ, మల్లాడి నాగేశ్వరరావు, ఒడుగు గోవిందరాజు, మల్లాడి నరసింహ స్వామి, ఒడుగు సుబ్బారాయుడు, ఒడుగు కొంబతరిం, మల్లాడి ధర్మరాజు, మల్లాడి కుమారస్వామి, ఒడుగు శ్రీను, మల్లాడి బాబూరావు, ఒడుగు వెంకటరాజు, మల్లాడి లక్ష్మణస్వామి, మల్లాడి శ్రీను, ఒడుగు ఆంజనేయులు, ఒడుగు ధర్గరాజు, ఒడుగు రాంబాబు, ఒడుగు శ్రీను, ఒడుగు నరసింహ స్వామి తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరికలు

పాలకోడేరు: శృంగవృక్షం రావి చెరువు గట్టు ప్రాంతానికి చెందిన టీడీపీ కార్యకర్తలు వార్డు మెంబరు పాల రాంబాబుతో సహా 160 మంది స్థానిక నాయకులు ఆధ్వర్యంలో నర్సాపురం పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ సమక్షంలో పార్టీలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరంతా ముఖ్యమంత్రి జగనన్న పాలనమెచ్చి పార్టీలోకి వచ్చామని తెలిపారు.

ప్రత్యేక ఓటర్లకు సదుపాయాలు



సుమిత్ కుమార్, జిల్లా కలెక్టర్

భీమవరం (ప్రకాశంచౌక్): సాధారణ ఎన్నికల ఓటింగ్ సమయంలో ప్రత్యేక కేటగిరీకి చెందిన దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్ జెండర్ ఓటర్లకు అసౌకర్యం కలగకుండా సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను పకడ్బందీగా అమలు చేయడం ద్వారా, ఎక్కడా ఉల్లంఘన జరగకుండా చూస్తున్నామన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,463 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సమయంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని ఏర్పాట్లను ఏఆర్వోల ద్వారా చేస్తున్నామని చెప్పారు. ముఖ్యంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద టాయిలెట్లు, తాగు నీరు, రవాణా, షామియానాలు, పార్కింగ్ ప్లేస్, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, సూచిక బోర్డుల ఏర్పాటుకు ఆదేశించినట్లు తెలిపారు. ప్రత్యేకించి దివ్యాంగులు, సీనియర్ సిటిజన్లు, ట్రాన్స్‌జెండర్ ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గ్రౌండ్ ఫ్లోర్ ప్రాధాన్యతతో పోలింగ్ బూత్‌ల ఏర్పాటు చేయాలని సూచించామన్నారు.

ఉంగుటూరు టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

ఉంగుటూరు: ఉంగుటూరు టీడీపీలో విభేదాలు భగ్గుమన్నాయి. మండల పార్టీ నాయకులపై భౌతిక దాడి చేసిన ఐదుగురిని శనివారం సస్పెండ్ చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు పాతూరు విజయకుమార్ వ్యవహార శైలి పట్ల టీడీపీ నేతలు, కార్యకర్తలు అసంతృప్తిగా ఉన్నారు. జనసేనకు అనుకూలంగా వ్యవహరిస్తూ టీడీపీ కార్యకర్తలను తమ వెంటే రావాలని, జనసేనలో చేరాలని ఒత్తిడి తెచ్చిన విజయకుమార్‌ను వారు అంగీకరించలేదు. ఈ నెల 29న మహాపాదయాత్ర కార్యక్రమంలో నారాయణపురంలో సప్త వీరబాబు, నల్ల ఆనంద్, నక్కల గణేష్, పల్లి దానయ్య, బొడ్డు ప్రవీణ్‌కు, మండల నాయకుల మధ్య విభేదాలు రచ్చకెక్కాయి. దీంతో పాతూరు విజయకుమార్, గోలి శ్రీనివాసరావులపై ఆ ఐదుగురు దాడి చేశారు. దీంతో వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు.

● సంక్షేమం, అభివృద్ధికి పట్టంకడదాం



పెనుగొండ: మండలంలోని వదలిలో ఎన్నికల ప్రచారంలో సరదాగా చిన్నారిని ఎత్తుకున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



నరసాపురం రూరల్: మండలంలోని బియ్యపుతిప్పలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



పాలకొల్లు అర్బన్: అరట్లకట్లలో భవన నిర్మాణ కార్మికుడికి సాయం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

మావుళ్లమ్మ హుండీ ఆదాయం రూ.40.82 లక్షలు

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఆలయ హుండీలను శనివారం లెక్కించగా 45 రోజులకి గాను రూ.40,82,260 ఆదాయం లభించినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి బుద్ధ మహాలక్ష్మి నగేష్ చెప్పారు. ఇవి కాక కానుకల రూపంలో 67.100 గ్రాముల బంగారం, 165 గ్రాములు వెండి లభించిందన్నారు. హుండీల లెక్కింపులో తనిఖీదారు వి.వెంకటేశ్వరరావు, కర్రి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మేరీ మాత దీక్ష విరమణకు వచ్చి..

గోదావరిలో మునిగి యువకుడి మృతి



పుల్లారావు (ఫైల్)

తాళ్లపూడి: వేగేశ్వరపురం గోదావరి మేరీ మాత దీక్ష పూర్తి చేసుకుని, కుటుంబ సభ్యులు, బంధువులతో కలసి అమ్మవారి దర్శనానికి వచ్చిన ఓ యువకుడు ప్రమాదవశాత్తూ గోదావరిలో మునిగి మృతి చెందాడు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి ఎస్సై టి.శ్యామ్‌సుందర్ కథనం ప్రకారం.. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం సి.గుడిపూడి గ్రామానికి చెందిన బిల్లుగుడి పుల్లారావు (20), కుటుంబీకులు, బంధువులు వేగేశ్వరపురం గోదావరి మేరీమాత 40 రోజుల దీక్ష చేశారు. ఈస్టర్ పర్వదినానికి ముందు రోజున దీక్ష విరమణ కోసం పుల్లారావు వారందరితో కలసి శనివారం ఈ ఆలయానికి వచ్చాడు. ఉదయం తొమ్మిది గంటలకు గోదావరిలో స్నానం చేయడానికి దిగిన పుల్లారావు ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోతుండగా, సమీపంలోనే స్నానం చేస్తున్న అతడి తండ్రి పొట్టయ్య, బంధువులు హేమంత్, రవికుమార్ పుల్లారావును రక్షించేందుకు ప్రయత్నించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది. పుల్లారావు నదిలో మునిగి మృతి చెందాడు. ఈ దుర్ఘటనపై పుల్లారావు తండ్రి పోతయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై శ్యామ్‌సుందర్ చెప్పారు.

సి.గుడిపాడులో విషాదఛాయలు

చాట్రాయి: మేరీ మాత దీక్ష విరమణ కోసం తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలోని మేరీ మాత దర్శనానికి వెళ్లి అక్కడ గోదావరిలో స్నానం చేస్తూ పుల్లారావు మృతి చెందడంపై సి.గుడిపాడులో విషాదఛాయలు అలుముకున్నాయి. దీక్ష పూర్తి చేసుకుని సంతోషంగా వేగేశ్వరపురం వెళ్లిన కుటుంబ సభ్యులు కుమారుడి మృతదేహంతో తిరిగి రావడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలి పనులు చేసుకుని జీవిస్తున్న కుటుంబానికి ఎంత కష్టం వచ్చిందంటూ కన్నీరుమున్నీరయ్యారు. వైఎస్ ఎంపీపీ పుచ్చకాయల సుబ్బారెడ్డి, సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, ఉప సర్పంచ్ రఘుపతిరెడ్డి, నాయకులు విస్సంపల్లి సీతయ్యలు పుల్లారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

హలీమ్.. సలామ్

- రంజాన్ మాసంలో మాత్రమే లభించే విశిష్ట వంటకం
- గతంలో హైదరాబాద్‌కే పరిమితం.. నేడు అన్ని చోట్లా లభ్యం
- ముస్లింలు తయారు చేసే ఈ వంటకానికి యమ డిమాండ్
- ప్రతి రోజూ జిల్లాలో రూ.7 నుంచి 8 లక్షల వరకు వ్యాపారం



హలీమ్ తయారీలో నిమగ్నమైన పనివారు



భీమవరం (ప్రకాశం చౌక్): రంజాన్ మాసంలో మాత్రమే లభించే ప్రత్యేక వంటకం హలీమ్. ఒకప్పుడు హైదరాబాద్‌కు మాత్రమే పరిమితమైన ఈ వంటకం గత 15 ఏళ్లుగా జిల్లా వాసులకు కూడా అందుబాటులో ఉంటోంది. ప్రతి ఏడాది రంజాన్ మాసంలో తయారు చేసే ఈ వంటకాన్ని తిన్న చిన్నా పెద్దా ఎవరైనా సరే దీని రుచికి సలాం కొట్టాల్సిందే. గత కొన్నేళ్లుగా జిల్లాలో కొన్ని చోట్ల హలీమ్ తయారీ దుకాణాలను ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. వంటకం తయారీ కోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా మాస్టర్లను, తయారీలో ఉపయోగించే మసాలాలు, దినుసులను సైతం అక్కడి నుంచే తీసుకువస్తున్నారు. హలీమ్‌లో చికెన్, మటన్, వెజిటబుల్ అనే మూడు రకాలున్నాయి. అయితే జిల్లాలో చికెన్, మటన్ హలీమ్‌లనే ప్రస్తుతం తయారు చేస్తున్నారు.

తయారీకి ఐదారు గంటల సమయం

హలీమ్ తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, వెన్న, గోధుమలు, జీడిపప్పు, బాదం, పిస్తా, షాజీరా, యాలకులతో పాటు సన్నగా తరిగి, నేతిలో వేయించిన ఉల్లిపాయలు, పుదీనా, కొత్తిమీర వంటి 30 రకాల వివిధ రుచికరమైన దినుసులు వాడతారు. పెద్ద పొయ్యి మీద పెద్ద గిన్నెలు పెట్టి వాటిలో చికెన్, మటన్‌లను విడివిడిగా ఐదారు గంటల పాటు ఉడికించి పేస్ట్ రూపంలోకి వచ్చేవరకు వండుతారు. ఇక ధర విషయానికి వస్తే చికెన్ హలీమ్ రూ.80, మటన్ హలీమ్ రూ.140 వరకు విక్రయిస్తున్నారు.



హలీమ్ రుచిని ఆస్వాదిస్తున్న యువకులు

హలీమ్‌తో పాటు మటన్ దమ్ బిర్యానీ, చికెన్ దమ్ బిర్యానీ, ఖాద్దుర్ ఖీర్, ప్రత్యేక మిఠాయి వంటివి ఈ దుకాణాల్లో విక్రయిస్తున్నారు.

హైప్రొటీన్ ఫుడ్

హలీమ్‌లో హైప్రొటీన్లు, కేలరీలు, కాల్షియం పుష్కలంగా ఉంటాయి. శరీరంలో లోపించే విటమిన్లను సమృద్ధిగా అందించేందుకు హలీమ్ ఉపయోగపడుతుంది. ఉపవాస దీక్షలు చేసే ముస్లింలు తక్షణ శక్తి కోసం ఉపవాస దీక్ష సాయంత్రం హలీమ్ తీసుకుని శరీరంలో శక్తిని పెంచుకుంటారు. ఇది పిల్లలకు సైతం ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం.

జిల్లాలో జోరుగా అమ్మకాలు

హలీమ్ అమ్మకాలు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. భీమవరం, తాడేపల్లిగూడెం, నరసాపురం, తణుకు ప్రాంతాల్లో హలీమ్ దుకాణాలు ఉన్నాయి. అలాగే భీమవరం నుంచి పాలకొల్లు, ఆకివీడు వంటి ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. జిల్లాలో 20 వరకు హలీమ్ దుకాణాలు ఉన్నాయి. రంజాన్ మాసంలో ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా రూ.7 నుంచి రూ.8 లక్షల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా. ఏటా రంజాన్ మాసం నెల రోజుల్లో సుమారు రూ.2 కోట్ల మేర హలీమ్ అమ్మకాలు జరుగుతున్నాయని చెబుతున్నారు

రాత్రి వరకు దుకాణాల వద్ద రద్దీ

రోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు హలీమ్ వేడిగా లభిస్తోంది. యువత, చిన్నపిల్లలతో కలిసి కుటుంబ సమేతంగా హలీమ్ తినేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో రాత్రి వరకు దుకాణాలు రద్దీగా ఉంటున్నాయి.



భీమవరంలో హలీమ్ కోసం దుకాణం వద్ద సందడి

తయారీకి చాలా శ్రమించాలి



హలీమ్ తయారు కోసం ఇద్దరు మాస్టర్లు శ్రమిస్తారు. చిన్న పాటి మంటపై అడుగంటకుండా ఇద్దరు వ్యక్తులు తరచు పొడవాటి ఇనుపవస్తువుతో తిప్పుతూ ఉండాలి. ఏ మాత్రం అడుగంటినా రుచిలో తేడా వస్తుంది. ఒకప్పుడు హలీమ్ అంటే కేవలంలో హైదరాబాద్‌లో మాత్రమే లభించేది. గత 15 ఏళ్లుగా భీమవరంలో హలీమ్ సెంటర్ పెట్టి మన ప్రాంత ప్రజలకు రంజాన్ మాసంలో హలీమ్ అందిస్తున్నాం. హైదరాబాద్ నుంచి హలీమ్ తయారీలో చేయి తిరిగిన వంట మాస్టర్లను తీసుకువచ్చి నెలరోజులు పాటు వారిని ఇక్కడే ఉంచి వారితో హలీమ్ తయారు చేస్తున్నాం. వీరితో పాటు దాదాపు 10 మందికి ఉపాధి లభిస్తుంది. భీమవరంలో హలీమ్‌ను చాలా ఇష్టంగా తింటారు.

– ఎస్‌కే షాజీ, హలీమ్ వ్యాపారి

ప్రతి ఏడాదీ తింటాను



హలీమ్‌ను ప్రతి ఏడాది ఇష్టంగా తింటాను. హలీమ్ తినేందుకు రంజాన్ మాసం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తుంటా. చికెన్, మటన్ హలీమ్ రెండు చాలా బాగుంటాయి. గతంలో హైదరాబాద్‌లో మాత్రమే లభించే హలీమ్ ఇప్పుడు భీమవరంలో కూడా అందుబాటులోకి రావడం చాలా సంతోషం. భీమవరం తోపాటు చుట్టుపక్కల వారు సైతం వచ్చి హలీమ్ తింటున్నారు.

– కె.కిషోర్, భీమవరం

హలీమ్ అంటే చాలా ఇష్టం



హలీమ్ అంటే చాలా ఇష్టం. ప్రతి ఏడాది భీమవరంలోని షాపుల్లో ఈ వంటకాన్ని తింటాను. చికెన్, మటన్ రెండూ బాగుంటాయి. అలాగే ఇక్కడ స్వీట్, ఖాద్దుర్‌కీర్ కూడా చాలా బాగుంటుంది.

– గిరి, భీమవరం

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.52 కోట్లు

స్వామివారికి 17 రోజులకు వచ్చిన కానుకలు



ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ హుండీల లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో శనివారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 17 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.1,52,94,247 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు చెప్పారు. అలాగే కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 320 గ్రాముల బంగారం, 3.392 కేజీల వెండితో పాటు, అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. అదేవిధంగా లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2 వేలు, రూ. వెయ్యి, రూ.500 నోట్ల ద్వారా రూ.34,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. తాపీ కూలీ మృతి

ద్వారకాతిరుమల : విద్యుత్ స్తంభాన్ని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఓ తాపీ కూలీ మృతి చెందగా, మరో కూలీకి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. కొమ్మర గ్రామానికి చెందిన డొక్కా సాయికృష్ణ (19), అతని స్నేహితుడు కలకొండ సంతోష్ తాపీ పనులు చేస్తుంటారు. శుక్రవారం రాత్రి వీరు బైక్‌పై రాళ్లకుంట వెళ్లి, కూలి డబ్బులు తీసుకుని స్వగ్రామానికి వెళుతున్నారు. కొమ్మర వద్ద కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న సాయికృష్ణ, వెనుక కూర్చున్న సంతోష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఏలూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లగా, మెరుగైన చికిత్స నిమిత్తం సాయికృష్ణను విజయవాడలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సాయికృష్ణ మృతి చెందాడు. ఇదిలా ఉంటే సంతోష్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై సతీష్ శనివారం పరిశీలించారు. మృతుడు తల్లి నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

నేడు ఏఐఎల్‌యూ సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఏఐఎల్‌యూ) రాష్ట్ర కమిటీ సమావేశం ఆదివారం ఏలూరులోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు సంఘం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శి ఓరుగంటి శైలజ, కామన మునిస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు సుంకర రాజేంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నల్లూరి మాధవరావు, వివిధ జిల్లాల నుంచి 75 మంది కమిటీ సభ్యులు హాజరవుతారని పేర్కొన్నారు.


దళితులంటే చంద్రబాబుకు అంత చిన్నచూపా

లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ విమర్శ



చింతలపూడి: టిప్పర్ డ్రైవర్‌కు జగన్ ఎమ్మెల్యే సీటు ఇచ్చాడంటూ ప్రజాగళంలో భాగంగా రాయలసీమలో చంద్రబాబు అవహేళనగా మాట్లాడిన తీరుపై యావత్తు దళిత సమాజం తీవ్రంగా ఖండిస్తోందని లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ చంద్రబాబుకు పేదలు, మాదిగలపై ఉన్న చులకనభావాన్ని ఈ ఘటన తేటతెల్లం చేస్తోందంటూ దుయ్యబట్టారు. చంద్రబాబు విద్యార్థి దశ నుంచి కూడా అణగారిన కులాలను చిన్నచూపు చూసేవాడిని అతని సహచరులే అంటుండేవారని, ఇది ఈ ఘటనతో రుజువైందన్నారు. ఇలాంటి చంద్రబాబును శంకరగిరి మాణ్యాలకు దళితులు, పేదలు పంపే సమయం ఆసన్నమైందన్నారు. విద్యావంతుడైన మాదిగ కులానికి చెందిన వీరాంజనేయులు బతుకుదెరువు కోసం డ్రైవర్ వృత్తి చేసుకోవడం నేరమా?, పేద విద్యావంతులు, డ్రైవర్లు చట్టసభల్లోకి వెళ్లకూడదా అని చంద్రబాబుని ప్రశ్నించారు. గతంలో చంద్రబాబు, పెద్ద మాదిగను అవుతానని మోసం చేసిన తీరు, 'ఎస్సీలలో ఎవరైనా పుట్టాలనుకుంటారా', 'బీసీల తోకలు కత్తిరిస్తా' అని అన్నందుకు చంద్రబాబుకు మాదిగలు, దళితులు ఎలా బుద్ధిచెప్పారో మర్చిపోకముందే మరోసారి చంద్రబాబు తన మనసులో మాట బయటపెట్టి పేదలు, అణగారిన కులాల పట్ల ఉన్న స్థానమేమిటో అర్థమవుతోందన్నారు. పేదలను చట్టసభల్లోకి పంపేందుకు ఇష్టపడకపోగా.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలను అందులో మాదిగలను గుర్తించి డ్రైవర్ అయిన వీరాంజనేయులు మాదిగని శింగనమల అసెంబ్లీ అభ్యర్థిగా, అలాగే ఉపాధి హామీ కూలీ ఈర లక్కప్ప మాదిగని మడకశిర అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటిస్తే తట్టుకోలేక చంద్రబాబు వారిపై ఉన్న తన అక్కసును వెళ్లగక్కాడన్నారు. పేదలకు సీట్లు ఇవ్వకపోగా, పేదలను గుర్తించి సీట్లు ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడం బాధాకరమన్నారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులు మాదిగను అవమానించిన చంద్రబాబు తీరుపై మందకృష్ణ నోరు విప్పాలని, టీడీపీకి ఎంఆర్‌పీఎస్ మద్దతు ఉపసంహరించుకోవాలని మందకృష్ణకు సొంగా సందీప్ విజ్ఞప్తి చేశారు. వయసు మీదపడి వృద్ధాప్యంలో ఏం మాట్లాడుతున్నారో అర్థం కానీ స్థితిలో చంద్రబాబు ఉన్నారని, ఈ ఎన్నికల్లో దళితులు చంద్రబాబుకి ఓట్లతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

నాటు తుపాకుల స్వాధీనం



నిందితులు, నాటు తుపాకులతో సీఐ, ఎస్ఐలు

కై కలూరు: రామవరం గ్రామంలో లైసెన్స్ లేని రెండు నాటు తుపాకులను కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు కైకలూరు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ చెప్పారు. రూరల్ సీఐ బి.కృష్ణకుమార్‌తో కలిసి విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. తమిళనాడు రాష్ట్రం విల్లుపురానికి చెందిన ప్రవీణ్ స్మిత్ (25), ఎడ్విన్ జాయ్ (22) చేపల చెరువులపై పక్షులను బెదిరించడానికి నాటు తుపాకులను ఉపయోగిస్తున్నారన్నారు. తనిఖీలో భాగంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై చెప్పారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ పాటించాలని, లైసెన్సులు లేకుండా ఆయుధాలతో సంచరిస్తే కేసులు నమోదు చేస్తామని సీఐ హెచ్చరించారు.

క్లుప్తంగా

న్యాయవాదుల బార్ అసోసియేషన్ కోశాధికారిగా రత్నదీప్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ న్యాయవాదుల బార్ అసోసియేషన్ 2024–25 సంవత్సరానికి ఏకగ్రీవ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అయితే కోశాధికారి పదవికి పోటీ జరగడంతో శనివారం జరిగిన పోలింగ్‌లో పీ.ఎస్. రత్నదీప్ గెలుపొందారు. న్యాయవాదులు అభినందనలు చెప్పారు. ఎన్నికల అధికారులు పీతల సుధాకర్‌రావు, పుట్టా వేణుగోపాల చౌదరి, మరపట్ల అజయ్, గుత్తికొండ శ్రీనివాసరావులు పర్యవేక్షించారు.

పోలీసుల కవాతు



తణుకులో కవాతు నిర్వహిస్తున్న పోలీసు బలగాలు

తణుకు: రాబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రజలకు విశ్వాసం కలిగించడానికి పోలీసులు శనివారం తణుకులో కవాతు నిర్వహించారు. ప్రశాంతమైన, స్వేచ్ఛ యుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించేకునేలా ప్రజలకు భరోసా ఇచ్చేందుకు తణుకు పట్టణ సీఐ ఎం.నాగరాజు ఆధ్వర్యంలో కేంద్ర భద్రతా బలగాలతో కలిసి కవాతు చేశారు. ఎలాంటి ప్రలోభాలకు ఓటర్లు గురి కాకుండా నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు శ్రీనివాస్, అప్పారావు, ట్రాఫిక్ ఎస్సై జానా సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శర్మ

తాడేపల్లిగూడెం రూరల్: ఎన్నికల నియమాలకు ప్రతి తప్పకుండా పాటించాలని ఎంపీడీవో, పంచాయతీ విస్తరణ అధికారి శర్మ తెలిపారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయం భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జన కూడలిలో చలివేంద్రాలను గ్రామ పంచాయతీ బోర్డులతో ఏర్పాటు చేయాలని, ఎ.ఎన్.ఎంలు ఓఆర్ఎస్ ప్యాకెట్లును అందుబాటులో ఉంచాలని, నడి వయస్సు, పెద్ద వయస్సు, చిన్న పిల్లలు, గర్భిణుల వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కళ్లు తిరగడం, తలపోటు, పిట్స్, స్పృహ తప్పి పడిపోవడం వంటి వడదెబ్బ లక్షణాలు ఉంటాయని తెలిపారు. రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రపరిచి నీటిని సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, గ్రామ రెవిన్యూ సిబ్బంది, మండల వైద్యాధికారులు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టిన కారు



ప్రమాదానికి గురైన కారు ముందు భాగం

తణుకు: మండలంలోని దువ్వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు యువకులకు స్వల్ప గాయాలయ్యాయి. భీమవరం నుంచి విజయవాడ వెళుతున్న కారు దువ్వ గ్రామ పరిధిలోని కొత్త వంతెనపై అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని బెలూన్స్ తెరచుకోవడంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురు యువకులు క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదం కారణంగా ట్రాఫిక్ కిలోమీటర్లు మేర నిలిచిపోయింది. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదని వెల్లడించారు.

ఘనంగా 'రన్ ఫర్ జీసస్'



గూడెంలో రన్ ఫర్ జీసస్ కార్యక్రమంలో పాల్గొన్న క్రైస్తవ సంఘ నాయకులు

పెంటపాడు: పట్టణంలో శనివారం ఉదయం గూడెం వీధుల్లో రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గాడ్స్‌మినిస్ట్రీస్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం కడకట్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఏలూరు రోడ్డు మీదుగా మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ స్వగృహం వద్ద ముగిసింది. ఈ సందర్భంగా గూడెంపట్టణానికి చెందిన పలు డినామినేషన్ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా ప్రగతి

- తాగునీటి బాధలకు చెక్
- సిద్ధమవుతున్న రెండో వేసవి జలాశయం
- రూ.42 కోట్లతో అభివృద్ధి పనులు



తాడేపల్లిగూడెం: పట్టణ జనాభా వేల సంఖ్య నుంచి లక్షా పదివేలకు చేరింది. 1975లో ఏర్పాటు చేసిన పంపుల చెరువు మాత్రమే ఇంత మంది తాగునీటి అవసరాలను తీర్చాల్సి వస్తోంది. రెండో వేసవి జలాశయం ఏర్పాటుకు ఆది నుంచి బాలారిష్టాలు , న్యాయ సంబంధమైన వ్యాజ్యాలు, కృత్రిమ ప్రజా ఉద్యమాలు ప్రతిబంధకాలుగా మారాయి. దీంతో వేసవి వచ్చిందంటే శివారు ప్రాంతాల్లో నీటి ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయి. ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలి. లేదంటే ఇబ్బందులే. ఈ పరిస్థితులను లోతుగా అధ్యయనం చేసిన, ఆకళింపు చేసుకున్న ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ సమస్య పరిష్కారం కోసం కృషి చేశారు. గూడెం మండలంలోని కుంచనపల్లి పరిధిలోని కడియపు చెరువును రెండో వేసవి జలాశయం కోసం ప్రతిపాదించారు. గోదావరి ఏలూరు కెనాల్ ద్వారా ఈ చెరువులోకి నీటిని మళ్లించి, అక్కడి నుంచి ప్రత్యేక పైపులైను ద్వారా పట్టణంలోని నీటి



పనులకు శంకుస్థాపన చేసిన ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ (ఫైల్)



గూడెంలో రెండో వేసవి జలాశయం కోసం కేటాయించిన కడియపు చెరువు



పట్టణానికి మంచినీరు అందించే పంపుల చెరువు

అవసరాలు కలిగిన ప్రాంతాలకు భవిష్యత్‌లో 25 సంవత్సరాల్లో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండే విధంగా వేసవి జలాశయం ఏర్పాటుకు రూపకల్పన చేశారు. భూసేకరణ విషయంలో వ్యాజ్యాలు కాస్త చికాకు పెట్టినా, అవి పరిష్కారం కావడంతో అమృత్ 2.0లో రూ.41 కోట్ల 79 లక్షల అంచనాతో జలాశయం పనులకు ఇటీవల శంకుస్థాపనలు చేశారు. పనులు వేగంగా సాగుతున్నాయి.

వేసవిలో నీటి కష్టాలకు చెక్

పట్టణంలో 27,192 గృహాలున్నాయి. 15,554 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. బీపీఎల్ కనెక్షన్లు 3,478 ఉన్నాయి. పబ్లిక్ స్టాండ్ కుళాయిలు 348 ఉన్నాయి. రోజు ఉదయం ఒక గంట, సాయంత్రం పూట ఒక గంట పాటు మంచినీటి సరఫరా చేస్తున్నారు. 143.47 కిలో మీటర్ల మేర ఉన్న పైపులైను ద్వారా మంచినీటిని సరఫరా చేస్తున్నారు. 556 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన పంపుల చెరువు ద్వారా నీటిని శుద్ధిచేసి సర్వీస్ రిజర్వాయర్ల ద్వారా అందజేస్తున్నారు. పట్టణంలో పెరిగిన జనాభా కారణంగా శివారు ప్రాంతాలు పెరిగాయి. దీంతో ఆ ప్రాంతాలకు నీటిని వేసవిలో అందజేసే స్థితి లేదు. గోదావరి ఏలూరు కాలువకు అడ్డుకట్ట వేసి కొంత సమస్యను అధిగమిస్తున్నారు. జువ్వలపాలెం, ముదునూరుపాడు, కడకట్ల వంటి పది ప్రాంతాలకు వేసవిలో నీరు అందడంలేదు. దీంతో రెండో వేసవి జలాశయం అనివార్యమైంది.

25 సంవత్సరాల వరకు అవసరాలు తీర్చే విధంగా భవిష్యత్‌లో 25 సంవత్సరాల కాలంలో తాగునీటి డిమాండ్‌ను అంచనా వేసి , అమృత్ 2.0లో సుమారు రూ.42 కోట్లతో కుంచనపల్లిలోని కడియపు చెరువును రెండో వేసవి జలాశయంగా తీర్చి దిద్దుతున్నారు.

పనివివరాలు

- ఎస్ఎస్ ట్యాంకు -9.44 కోట్లు
- పైపులైన్లకోసం -13.06 కోట్లు
- పంపుసెట్లు-0.57 లక్షలు
- 250 కేవీఏ ట్రాన్సుఫార్మర్లు రెండు-0.47 లక్షలు
- 125 కేవీఏ జనరేటర్లు రెండు -0.37 లక్షలు
- 500 కెఎల్ ఈఎల్ఎస్ఆర్ -1.27 కోట్లు
- ఆఫ్‌టేక్ ఛాంబర్ -0.18 లక్షలు
- రా వాటర్ సంప్, పంపు హౌస్-0.29 లక్షలు
- ఇన్‌లెట్ టవర్, రా వాటర్ డ్రాఆఫ్ వెల్-0.54 లక్షలు
- ఓ అండ్ ఎమ్ -2.86 కోట్లు
- జీఎస్‌టీ.సీనరేజీ ఇతర ఖర్చులు -12.74 కోట్లు

కలిపి ఈ వేసవి జలాశయం కోసం 41.79 కోట్ల రూపాయలు వెచ్చిస్తున్నారు.

ఎన్ఎస్ఎస్‌లో అవార్డులు



అవార్డులు అందుకుంటున్న బృందం సభ్యులు

తాడేపల్లిగూడెం: జేఎన్‌టీయు కాకినాడ నుంచి జాతీయ సేవా పథకం విభాగంలో శశి ఇంజనీరింగ్ కళాశాలకు రెండు అవార్డులు దక్కాయి. ఉత్తమ ప్రోగ్రామ్ అధికారిగా షేక్ సల్మాన్ భాషా, ఉత్తమ వలంటీర్ విద్యార్థినిగా జి.యామిని పురస్కారాలను అందుకున్నారు. కాకినాడలో శనివారం జరిగిన కార్యక్రమంలో జేఎన్‌టీయు వీసీ .జి.వి.ప్రసాద్, రిజిస్ట్రార్ యల్.సుమలత, ఓఎస్‌డీ ప్రొఫెసర్ శ్యామ్‌కుమార్‌లు అందజేశారు.

నేడు రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ సమావేశం, నెలవారి కళాకారుల సభ ఈ నెల 31వ తేదీ ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణలు వెల్లడించారు. కూచిపూడి, జానపద నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు జరుగుతాయని చెప్పారు. యువజన సంఘ అధ్యక్షుడు పఠాన్ వల్లికి గౌరవ సత్కారం, నాట్యాచారిణి రమ్యశ్రీకి నాట్యా కళారత్న పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయులు బండారు జ్ఞాన ప్రసాద్‌కు ఉద్యోగ సేవా పురస్కారం, సీనియర్ కళాకారులు వాడపల్లి చిన్నారావుకు ఆర్థిక సత్కారం చేయనున్నట్లు తెలిపారు. కళాకారులు, హాజరు కావాలని కోరారు.

పథకాలు చూడండి..ఓటేసి గెలిపించండి

తణుకులో ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి

తణుకు అర్బన్: ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకున్న ఒకే ఒక్క వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 20, 21 వార్డులో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మంత్రి కారుమూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెప్పాడంటే చేస్తాడంతే అనే నానుడితో జగన్ పేరే ఒక నమ్మకంగా ప్రజల్లో బలంగా నాటుకుపోయిందని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలంతా కాలర్ ఎగరేసి ప్రజల్లోకి వెళ్లి ఓటడిగేలా ప్రజారంజక పాలనను జగనన్న అందజేశారని తెలిపారు. తణుకు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, నరసాపురం పార్లమెంట్ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలకు రెండు చోట్ల ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి మమ్మల్ని గెలిపిస్తే మళ్లీ మీ జగనన్న, జగన్ మామ, మీ తమ్ముడు ముఖ్యమంత్రిగా మీకు మంచి చేస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ పాల్గొన్నారు.

బడుగుల ద్రోహి చంద్రబాబు..

తణుకు అర్బన్: బడుగు బలహీన వర్గాలను ఎదగనీయకుండా అణగదొక్కడమే చంద్రబాబు జీవిత ఆశయంగా పెట్టుకున్నాడని



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాగేశ్వరరావు



తణుకులో మంత్రి కారుమూరికి రాఖీలు కడుతున్న మహిళలు

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకులో శనివారం ఎన్నికల శంఖారావంలో భాగంగా నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారం మదంతో అప్పుడు, ప్రతిపక్ష హోదాతో నేడు దళితులు, బీసీ వర్గాలపై నోరు పారేసుకునే అగ్రకుల అహంకారి చంద్రబాబు అని స్పష్టం చేశారు. అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి టిప్పర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న దళిత వర్గీయుడు ఎం.రామాంజనేయులును చంద్రబాబు బహిరంగ సభలో టిప్పర్ డ్రైవర్‌కు ఎమ్మెల్యే సీటు ఇచ్చారంటూ హేళన చేయడాన్ని భారత రాజ్యాంగాన్ని అవమానించినట్లేనని అన్నారు. నువ్వు 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఒక్క బీసీ వర్గానికి చెందిన వ్యక్తిని రాజ్యసభకు పంపించావా చంద్రబాబూ అని ప్రశ్నించారు.

సీఎం జగన్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పాలనను ప్రజలంతా అభిమానిస్తున్నారని వారి అభిమానాన్ని ఓటుగా పోలింగ్ బూత్ వరకు తీసుకెళ్లే బాధ్యత మీదేనని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. తణుకు 20, 21 వార్డులకు సంబంధించి కార్యకర్తలతో మంచి మాట్లాడారు. ప్రతి కార్యకర్త పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు.

మంత్రికి రాఖీ కట్టిన మహిళలు

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు పార్టీ మహిళలు రాఖీలు కట్టారు. తణుకులో ఎన్నికల శంఖారావంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, నియోజకవర్గ మైనారిటీ సెల్ అధ్యక్షురాలు ఫహీమా, పార్టీ మహిళలు మంత్రి కారుమూరికి కుంకుమ అద్ది రాఖీలు కట్టారు. మహిళలందరికీ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలకు సంబంధించి వారి భవిష్యత్తుకు అండగా నిలబడేందుకు ప్రభుత్వానికి రాఖీలు కట్టాల్సిందిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన నేపథ్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.

ఎన్ని పొత్తులు పెట్టుకున్నా అధికారం మాదే

తణుకు టౌన్: ఎన్ని పొత్తులు పెట్టుకున్నా అధికారం మాదే అని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అన్నారు. శనివారం తణుకు మండలంలోని కొమరవరం గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. కొమరవరం, మహాలక్ష్మీ చెరువు, యర్రాయి చెరువు, మండపాక గ్రామాల్లోని పార్టీ నాయకుల, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, కొమరవరం గ్రామ సర్పంచ్ కరిబండి రాజేశ్, సొసైటీ అధ్యక్షుడు నిమ్మకాయల సురేష్ బాబు, మహాలక్ష్మీ చెరువు గ్రామ సర్పంచ్ పాలా శ్రీను, ఎంపీటీసీ పాలా వెంకట దుర్గ, , యర్రాయి చెరువు సర్పంచ్ కేతా వెంకట లక్ష్మీ, నాయకులు కేతా సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల సన్యాసిరావు, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల మణికంఠ, బాబూరావు పాల్గొన్నారు.

పిల్లలను తల్లిదండ్రులు బాగా చదివించాలి



మాట్లాడుతున్న రొక్కాల నాగబుజ్జి

తాడేపల్లిగూడెం రూరల్: పిల్లలను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడానికి తల్లిదండ్రులు తమ పిల్లలను బాగా చదివించాలని సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యుడు రొక్కాల నాగబుజ్జి అన్నారు. రామన్నగూడెంలో శనివారం ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్ద పౌర హక్కుల దినోత్సవం తహసీల్దార్ బి.మురళీకృష్ణ అధ్యక్షతన జరిగింది. దళితుల స్మశాన వాటికి సమస్యను, ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించాలని అధికారులు దృష్టికి దళితులు తీసుకువచ్చారు. రొక్కాల నాగబుజ్జి మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు దళితుల సమస్యలను పరిష్కరిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, సహాయ సాంఘీక శాఖ అధికారి రామాంజనేయురాజు, వీఆర్‌ఓ మంగరాజు, రాము, పంచాయితీ కార్యదర్శి వేణు అరవింద్, రూరల్ పోలీసులు, మహిళా పోలీసులు అన్నపూర్ణ, పాల్గొన్నారు.

ఈస్టర్ పండగకు ఘనంగా ఏర్పాట్లు

పెంటపాడు: భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే పండుగను నిర్వహించిన క్రైస్తవ సోదరులు మూడవ రోజు ఆదివారం జరిగే ఈస్టరు పండుగ కోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు.దీనిలో భాగంగా శుక్ర, శని వారాల్లో ఆయా గ్రామాల్లోని క్రైస్తవుల సమాధులను అత్యంత సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు. ఇతర దేశాలు, ప్రాంతాల్లో ఉండే ఆయా గ్రామాలకు చెందిన క్రైస్తవులు తప్పనిసరిగా ఈ పండుగలో పాల్గొంటారు. తమ కుటుంబీకులకు చెందిన సమాధులను రెండు రోజులపాటు పరిశుభ్రం చేసి సుందరంగా తీర్చిదిద్దుతారు. ఈస్టరు పండుగను పురస్కరించుకుని ఆదివారం తెల్లవారు జామున ఊరేగింపుగా క్రైస్తవ శ్మశాన వాటికలకు చేరుకుంటారు. అక్కడ నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొంటారు. సమాధులను వివిధ రకాల పువ్వులు, కొవ్వొత్తులు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరిస్తారు. ప్రార్థనల అనంతరం సమాధుల వద్ద వివిధ రకాల ఫలహారాలను పంచుతారు. ఉదయం 10 గంటల నుంచి ఆయా గ్రామాల్లోని చర్చిల్లో ఈస్టరు పండుగను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. గూడెం ఎల్ఎల్ఎం చర్చిలో పాస్టర్ల సంఘ నాయకులు మల్లిపూడి జైబాబు, మల్లిపూడి యోరీల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ప్రత్యేక ఈస్టర్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు ఏర్పాటు చేశారు.

తణుకులో దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తణుకు మున్సిపల్ కార్యాలయం కేశవస్వామి గుడి వద్ద మున్సిపల్ యూపీ నెంబర్ 1 స్కూల్ ఆవరణలో సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఏప్రిల్ 3వ తేదీన ప్రభుత్వం, ప్రభుత్వం గుర్తింపు పొందిన పాఠశాలల్లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు చదువుచున్న దివ్యాంగుల పిల్లలకు ఉపకరణాల నిర్ధారణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని తాడేపల్లిగూడెం భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు ఎస్‌కే బాలీశ్వరయ్య తెలిపారు. దివ్యాంగుల విద్యార్థులకు అవసరమైన ఉపకరణాలు ప్రత్యేక వైద్య నిపుణులు పరిశీలించి ఉపకరణాలు ఎంపిక చేస్తారని, ఉపకరణాలు సమగ్ర శిక్ష ద్వారా ఉచితంగా అందజేస్తారని చెప్పారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలను ప్రతి శుక్రవారం విజయవంతం చేద్దామని మలేరియా సబ్ యూనిట్ హెల్త్ అధికారి వై.వి.లక్ష్మణరావు అన్నారు. పరిసరాల పరిశుభ్రత, దోమల నివారణ, ఆరోగ్య పరిరక్షణ తదితర అంశాలపై శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రం యాగార్లపల్లి అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలోని 18వ వార్డు బాలానగర్‌లో అవగాహన కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలన, వార్డుల్లో ర్యాలీలు సబ్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ కీటక జనిత ప్రదేశాలను గుర్తించి కీటక నియంత్రణలు తప్పనిసరిగా చేయాలని మున్సిపల్ శానిటరీ సిబ్బందికి సూచనలు చేశారు. మలేరియా అనేది చలి, వణుకుతో కూడిన జ్వరమని, ప్లేస్మోడియం పరాన్న జీవి వల్ల వస్తుందని చెప్పారు. డ్రైయిన్‌లలో నీటి పారుదల అమలు చేయడం, నీటి నిల్వలు ఉండే పల్లపు ప్రాంతాలను పూడ్పించాలన్నారు. అనారోగ్య సమస్యలు వస్తే సమీపంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌లు, ఏరియా ఆస్పత్రిల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న హెల్త్ సిబ్బంది

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం



వీరవాసరం: రాయకుదురులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

వీరవాసరం: మే నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని, ఇందులో ఎలాంటి సందేహం లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. మండలంలో తోకలపూడి, చింతలకోటిగరువు, రాయకుదురు, వీరవల్లిపాలెం, వీరవాసరం, నందమూరి గరువు, వడ్డిగూడెం, పెర్కిపాలెం గ్రామాల్లో శనివారం ఆయన నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ముందుగా తోకలపూడి, చింతల కోటి గరువు, రాయకుదురు, వీరవల్లి పాలెం, వీరవాసరం, వడ్డీ గూడెం, పెరికి పాలెం, నందమూరు గరువు, దూసనపూడి తదితర గ్రామాల్లో ఆయన పార్టీ నాయకులు కార్యకర్తలతో మాట్లాడారు. 2019 ఎన్నికలలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారు కాబట్టి ప్రజల్లోకి వెళ్లి ఓటు అడిగే హక్కు తమ వైఎస్సార్ సీపీకి మాత్రమే ఉందని ఆయన స్పష్టం చేశారు. 2014 ఎన్నికల్లో ఆనాడు చంద్రబాబు 600 కి పైగానే హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేశారని, అటువంటి వ్యక్తి నేడు అన్ని పార్టీలతో కలిసి కూటమిగా ఏర్పడి ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని అధికారం నుండి తప్పించాలని ప్రజలకు లేనిపోని హామీలను ఇస్తున్నారని మండిపడ్డారు. అందుకే ప్రజలు చంద్రబాబు, ఆయన కూటమి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఆయన వెంట టీటీడీ బోర్డు సభ్యుడు మేకా శేషుబాబు, ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, జేసీఎస్ కన్వీనర్ మానుకొండ ప్రదీప్‌కుమార్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కడలి ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.